కథ

# చింత

"కిట్టమ్మా! గోపాల బాలా కిట్టమ్మా! ఏహే..... కిట్టమ్మా!....."

ఊరమ్మటి చింతలతోపు సీయిందం గోయిందంగా వుంది. ఉత్తరోపేపు దరిన పెద్ద చింతచెట్టు దగ్గిర జనం చానా మంది జేరారు. ఒకేపు ఆడపిల్లలు, ఉంకోయేపు కుర్రకారు. కట్టకింద నర్సిమ్మకూతురు మాలక్ష్మి - పదేను పదారేళ్లుంటయ్యేమో - ఉయ్యాల బల్లమీద నుంచోని రయ్ రయ్న ఊగుతుంది. ఉయ్యాలంటే ఉయ్యాలా? పాతిక బార్ల మోకు ఎత్తాటి చింతకొమ్మ గట్టారు. నేలమీద నడుమెత్తున అర్ధబల్ల. దానికి గట్టిన తాడు బట్టుకోని ఊపుతున్నాడు సుబ్బాయ్. చేసేవాళ్ల కళ్లు తిరిగి పొయ్యే టట్టు, పైన చిటారుకొమ్మకి తగిలిద్దేమో అన్నంత ఊపు దెచ్చుకోని ఊగుతుంది మా లక్ష్మి. పిల్లకాయలు కేరింతలు గొడతన్నారు. పెద్దాళ్లు నోరు దెరుచుకోని చూస్తన్నారు.

రాత్రి బడ్డ వానజల్లుకి నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది. తోపునిండా తంగేడు చెట్లేంది, జిల్లేడు చెట్లేంది, లంజతుమ్మ చెట్లేంది, పిచ్చికునుం చెట్లేంది - పాదలకు మల్లే పెరిగినియ్. తోపు ఆ మూల నించి ఈ మూలకి కాలిదారి. ఆ దారి గుండా కృష్ణమూర్తి, వాడి సావాసగాడు నరసయ్య వస్తున్నారు. ఉంగ్రాళ్ల తట్టె ఉయ్యాల సందడి జూద్దామని. ఇద్దరూ బడెగ్గొట్టారు. అడుగులు బడ్డ నల్లమట్టి దార్లో నడుస్తుంటే 'చర్... చర్...'మని మోతొస్తంది.

వీరయ్యగారి చింతలతోపు ఇప్పుడిది గాదు. ఎప్పుడు బుట్టిందో. కృష్ణమూర్తి ముత్తాత వీరయ్య. ఊరి కానుకోని పడమటన తోపు మొదలయిద్ది.

పదిహేను గజాల కొకటి లెక్కన - కొన్ని పడిపోంగా డెబ్బై చెట్లన్నా వుంటయ్. కృష్ణమూర్తి వాటినెప్పుడు లెక్కబెట్టినా తేడా వచ్చేది. బడి లేని పూట సావాసగాళ్లని వెంటేసుకోని తోపులోకి జేరాల్సిందే. సన్నటి చిటారు కొమ్మకి గూడా కృష్ణమూర్తి పాకుతాడు. ఏ చెట్టుకెక్కువ కాయ లుంటయ్యో, దేన్నెక్కటం తేలికో వాడికి బాగా తెలును. చెట్టు మొదలు పైన కొమ్మలు చీలిన చోట ఏనాలుగా గూకోని పళ్లు పులిసి పోయెట్టు చింతకాయలు తింటా గంటలు గంటలు గడపటం, ఆ దార్నే పొలాలకి బొయ్యేవాళ్లని దడిపించటం వాడికి మా యిష్టం. అందరూ గలిసి కాస్త ముదురు చింతకాయలు కోసి మూటగట్టి కోమటి కొట్టుకి తీసుకెళ్తే జేబునిండా సెనగపప్పు పోస్తాడు సీతారావయ్య.

కృష్ణమూర్తి అల్లంత దూరంలో కనబడం గానే పుల్లయ్యగారి నారాయణ పాటెత్తు కున్నాడు ఎగతాళిగా, 'కిట్టమ్మా! గోపాల కిట్టమ్మా....' అంటూ. కృష్ణమూర్తికి చర్రన కోపం వచ్చింది. అమ్మా నాన్నా వాణ్ణి ముద్దుగా 'కిష్టమూర్తీ' అని పిలుస్తారు. నాన కెప్పుడైనా కోపంవస్తే 'ఇటరారా కిట్టాయ్' అంటాడు. ఊళ్లో అంతా 'కిట్ట మూర్తి' అనే పిలుస్తారు. నారాయణకి మాత్రం ఎందుకో అలుసు.

"నిన్నేం జేశానమ్మా నేను? అవపడ్డ ప్పుడల్లా ఏడిపిత్తావ్?" అన్నాడు కృష్ణమూర్తి ఉక్రోషంతో.

"వాణ్ణి గూడా నువ్ 'నారాయ్' అని పిలువు తిక్క వదులుద్ది" చెప్పాడు నరసయ్య.

"పోవాయ్" అంటూ నారాయణ ఉయ్యాల దగ్గిరికి పరిగెత్తాడు. ఉయ్యాల మీద ఒక్కళ్లు ఇద్దరిద్దరు ఊగుతున్నారు. వాళ్లని ఊపటానికి మగపిల్లలు పోటీ పడుతున్నారు.

"నేం గూడా ఊపొద్దన్నాయ్?" అనడిగాడు కృష్ణమూర్తి సుబ్బాయ్ని.

"బక్కపీసువి, నువ్వేం ఊపుతా?" అన్నాడు సుబ్బాయ్ నవ్వుతా.

కృష్ణమూర్తి మొకం చిన్న బుచ్చు కున్నాడు.

"పోనీలే, నన్నూపుతాడు" అంది శేషయ్య గారి చిన్నమ్మాయ్, ఉయ్యాలెక్కుతా.

కృష్ణమూర్తి కుశాలగా ఉయ్యాల తాడందుకున్నాడు "ఊప్..." అంటూ వెనక్కి లాగి ముందుకు తోశాడు.

"బాగా ఊపాలి పిల్గాడా!" అంది చిన్నమ్మాయ్. పేరుకి చిన్నమ్మాయేగాని ఇరవయ్యేళ్ళకి తక్కువుండవ్. ఛామనచాయ మిషమిష లాడతంది. ఇంకా పెళ్లిగాలా. మిలట్రీలో ఉన్న వాళ్ళ బావ రావాల, బాండు మేళం మోగాల.

అట్టట్టా చిన్నమ్మాయ్ ఊపు దెచ్చు కుంది. ఇంక కృష్ణమూర్తి ఊపేవన్లేక ఎడంగా నిలబడ్డాడు. చిన్నమ్మాయ్ ముందు కెళ్లేటప్పుడు కాళ్లు బాగా జాపుకోని, వెనక్కి బొయ్యేటప్పుడు కాళ్లు ముడుచుకోని రయ్రయ్యని ఊగుతూంది. 'వామ్మో దీనికి బయ్యమే లేదు' అనుకుంటా కృష్ణమూర్తి నోరు దెరుచుకోని చూస్తా వుండిపొయ్యాడు. ఇంతలోకి ఎదురుగాలికి చిన్నమ్మాయ్ లంగా పైకి లేచింది.

'ఎక్కిరాయిలే! జిల్లాయిలే, జీడిపప్పులే!' కృష్ణమూర్తి చేతివేళ్ళు మెలికలేసి చూసిస్తా ఎగిరాడు. 'హిహిహి' ఇకిలించాడు నరసయ్య. ఆడా మగా అంతా నవ్వారు.


"ఛీ పాడు పిల్లడా!" అంది చిన్నమ్మాయ్ గబుక్కన ఉయ్యాల దిగి,

"ఉయ్యాలెక్కంగానే సరిగాదే పిల్లా! ఒడుపూ, వాటం దెలవాల" అన్నాడు గడ్డంకింద కర్రచెట్టుకు చూస్తన్న ముసలాయన.

"మాలావు చెప్పొచ్చావులే, పెళ్లయితే అదే తెలుసుకుంటది" అంది ఆడవాళ్ల గుంపులో నుంచి వెంకట సుబ్బమ్మ. (దాని మొగుడు దేశాలమాద పొయ్యాడు) ఆడపిల్ల లంతా కిసుక్కుమన్నారు. చిన్నమ్మాయ్ సిగ్గు పడింది.



## పాపినేని శివశంకర్



"ఒరేయ్! చింతసెట్లకి ఆడాడ కాయ ఉండయ్‌రా. కోసుకుందామా?" అడిగాడు నరసయ్య కృష్ణమూర్తిని.

"అన్నీ వానగాయలు" అన్నాడు కృష్ణ మూర్తి చెట్ల కొమ్మల్లోకి పరీక్షగా చూసి.


"అయితే మాలే, వానగాయులే బాగుంటాయ్ తింటానికి" అన్నాడు నరసయ్య.

"సర్లే పా" అన్నాడు కృష్ణమూర్తి. బర్న ముక్కుచీది జారిపోతన్న లాగు పైకి లాక్కున్నాడు.

వాళ్లకితోడు ఇంకిద్దరు సావాసగాళ్ళు తగిలారు. తోపుకి ఇంకో మూలకెళ్ళి తలో చెట్టెక్కారు. కృష్ణమూర్తి జేబునిండా కాయలు కోసుకుని పెద్దకొమ్మ మొదట్లో కూర్చున్నాడు. ఎక్కడియ్యో బర్రెలు వొచ్చి చెట్టుకింద నీడకి నిలబడ్డయ్.

***

వానలు వెనకబడ్డయ్. పెసర, నువ్వు పంటల కాలం వచ్చింది. వరదయ్య అరెకరం నువ్వు, అరెకరం పెసర వేసాడు. పెద్దవానకి నువ్వుచేను ఊరకే పోయింది. వెనక చిక్కు అయినంతలో కాస్త పెసరే చేతికొచ్చింది. అదీ గింజలు బాగా ఊరలా. ఎండిన కాయల్ని చావిడి పంచలో పరదాపట్ట మీద పోసి ఇద్దరు కూలీలు బడితల్తో కొడతంటే చిందే గింజల్ని ఏరుకొని తింటన్నాడు కృష్ణమూర్తి. పని



చెయ్యటం లేదనుకోకుండా మధ్య మధ్య గింజల్ని కుప్ప దగ్గరికి పోగు జేస్తన్నాడు. ఆదివారం గాటాన బడి లేదు.

కమలమ్మ పిల్లని చంకనేసుకొని వచ్చింది. "అబ్బాయ్! కొట్టుకెల్లి అరకిలో బెల్లం దీసుకురా' ' అని చెప్పింది.

"డబ్బులియ్యి, ఎల్లొత్తా" అన్నాడు కృష్ణ మూర్తి.

"సీతారామయ్య కొట్లో మన పొద్దంది లేరా, అందుట్లో రాసుకుంటాళ్లే. పొయ్‌రా" చెప్పాడు వరదయ్య.

మూలనున్న బండిగాను దీనుకుని కర్రపుల్లతో తిప్పుకుంటా ఒక్క లగూ దీశాడు కృష్ణమూర్తి. గుడికి పడమటగా కోమట్ల వీధిలో ఉంది సీతారామయ్య కొట్టు. ఊళ్లో కెల్లా అదే పెద్ద కొట్టు. కొట్లో ఇద్దరు ముగ్గురు మనుషులుండే పాటికి కృష్ణమూర్తి పక్కగా నుంచున్నాడు.

"ఏందబ్బాయ్, ఏంగావాలా?" అడిగాడు సీతారామయ్య ఎవరికో జొన్నలు కొలుస్తా.

'అరకిలో బెల్లం దెమ్మన్నాడు మా నాన'

"అట్టనే దీసుకెల్లు" అని పక్కనే పట్టు మీదున్న బెల్లాని కత్తితో పగలగొడతా "ఏం జదువుతున్నా?" అనడిగాడు.

"ఐదు చెప్పాడు కృష్ణమూర్తి ఉషారుగా. అంతకన్నా ఊళ్లో ఎలిమెంటరీ స్కూల్లో పెద్ద క్లాసు లేదు.

సీతారామయ్య బెల్లం పొట్లం గట్టి ఇస్తా, "మీ నాన ఇంటి దగ్గరే వుండాడా?" అనడిగాడు.

"కొట్టం దగ్గిర పెసలు గొడతన్నారు."

"మాయెటేల యింటికొత్తానని జెప్పు"

కృష్ణమూర్తి తలూపి అట్టనే నిలబడ్డాడు.

"ఇంకేంది?" అడిగాడు సీతారామయ్య.

"కొసరు బెట్టవా?" అడిగాడు కృష్ణమూర్తి మెల్లిగా.

"ఓర్నీ, అదా" సీతారామయ్య చిన్న బెల్లం ముక్క చేతిలో బెట్టి "నే జెప్పిన మాట మర్సిపోకుండా జెప్పు" అన్నాడు.

కృష్ణమూర్తి తలూపి బెల్లం ముక్క నోట్లో వేసుకొని, చేతిలో పొట్లంతో ఇంటికి పరిగెత్తాడు.

'ఓర్నీ పిల్లాడు గంతలాడ! పడతావ్‌రా" అంది కమలమ్మ కొడుకును జూస్తా.

"పడన్లేగానీ అమ్మా! ఈ ఏడు చదువైపోతే ఆరోక్లాను చదివిస్తారేంటీ?" అడిగాడు కృష్ణమూర్తి.

ఏందో నాయనా! పంటలు జూత్తే ఇట్టుండయ్. పైవూళ్లో చదువులంటే మాటలా' అంది కమలమ్మ, పొయ్యి దగ్గర చతికిలబడతా. నాలుగు రోజుల కిందట పంతులుగారు ఏదో పనిమీద ఇంటికొచ్చి నప్పుడు చెప్పిన మాటలు గుర్తుకొచ్చినయ్ కమలమ్మకి. పిల్లాడు బాగా చదువు తున్నాడనీ, పైకొస్తాడనీ చెప్పాడాయన. ఊళ్లో హైస్కూలు లేదు. పదిమైళ్ళ దూరంలో పమిడిమర్రులో ఒకటీ, పదిహేను మైళ్ళ లో ఉలవపాడులో ఒకటీ ఉన్నయ్. ఉలవపాడులో కమలమ్మ చెల్లెలుంది. కొడుకుని అక్కడుంచి చదివించొచ్చు. 'ఏమో అప్పుడు సంగతి' అనుకుంది కమలమ్మ పొగలొట్టల్లో పొయ్యిరాజేస్తా.

రాత్రి పొద్దుబోయింది. కృష్ణమూర్తి పుస్తకాలు ముందేసుకొని కుస్తీపడు తున్నప్పుడు కోవిటి సీతారామయ్య వచ్చాడు. అప్పుడే ఉడుకుడుకు నీళ్లు బోసు కోని, ఉతికిన పంచె కట్టుకొని పెంకుటింటి ముందు మెల్లాలో మంచం మీద కూర్చున్నాడు వరదయ్య. ఇంటిముందు వేపచెట్టు మీదనుంచి గాలి మెల్లిగా 'దోలతంది. ఎక్కడో కీచురాయి 'గీ' మంటంది. బయటంతా గబ్బుగియ్యం.

"ఏంది వరదయ్యన్నా! మరీ నల్లపూసై పొయ్యావు" అంటూ వచ్చాడు సీతారామయ్య.

'నల్లపూసవ్వటమంటే ఏందబ్బా?' అనుకొన్నాడు కృష్ణమూర్తి. లోపల్నుంచి కమలమ్మ వచ్చి 'కూకో అన్నయ్యా!' అని స్టూలు చూపించింది. సీతారామయ్య కూర్చున్నాడు. 'ఏంతే. పనుల్లో బడి అటేపురాలా ఈ మద్దెల' అన్నాడు వరదయ్య.

"పెసలు గొట్టావా? ఎన్నయిన య్యేందీ?"

"మా అయితే రెండు కింటాళ్లవు తయ్యేమో. ఎప్పుడుకప్పుడు శాకిరీదప్ప సేతులో కొచ్చేది కనపట్టంలా." నిట్టూర్చాడు వరదయ్య.

"కాలమట్టుంది మరి. సరిగానీ కొట్లో ఖాతా పెరిగిపొయ్యింది. ఏమన్నా జమెయ్య రాదూ?" అడిగాడు సీతా రామయ్య మెల్లిగా.

"ఈ పెసలమ్మితే సూద్దాంలే."

'రేటెంతుందేం?"

"ఆ రెండొందలుంటదేమో."

"అదేదో నాకే అమ్మెయ్యరాదూ? పైవాడికిచ్చి అవస్త బడేకంటే ఊళ్లో బేరం. నాల్రూపాయలు తగ్గినా నమ్మకంగదా?"

వరదయ్య ఆలోచన్లోబడ్డాడు. సీతా రామయ్య కమ్మాలంటే రేటు తగ్గించి అమ్మాల. అమ్మినా ఇప్పుడు చేతులోకి వచ్చేదుండదు. పొలానికి మళ్లీ ఎతుక్కో వాల్సిందే. అదే బయటి వాళ్లకమ్మితే నాలుగు డబ్బులు చేతుల్లో పడతయ్. సీతా రామయ్య బాకీ పొగాకు పంటలో చూడొచ్చు. అందుకని వరదయ్య మాట్లాడకుండా ఊరుకున్నాడు. అతని ఆలోచన గ్రహించాడేమో సీతారామయ్య మళ్లీ రెట్టించలేదు. రైతుల్ని ఒత్తిడిపెట్టి బావుకుందామనే రకం గాదు సీతారామయ్య.

"నీడబ్బేడకీ పోదులేవయ్యా! ఇందుట్లో కాపోతే రేపు పొగాకుపంటలో తీరవలేమా యేంది?" అన్నాడు వరదయ్య.

"పొగాకా? ఇంక అయినట్టే. పోయనేడు పొగాకులో లాబాలు దీసినోళ్లు మనూళ్లో ఎవురుండారో జెప్పు. మెరకవీధి నాగేశ్వరరావూ, కిట్టయ్యగారి సుబ్బయ్యా పొలాలమ్ముకు పొయ్యారు గదా? ఇంకా పొగాకు మీద ఆశబెట్టుకుంటావేంది నీ పిచ్చిగాని. ఐయ్యేడు నలుగురైదుగురు పత్తి ఏస్తున్నారుగా, నువ్వుగూడా ఎయ్యరాదా?" అన్నాడు సీతారామయ్య. పెసలబస్తాల పక్కన తాలుపెసలు గుప్పెడు తీసుకొని ఊది నోట్లో వేసుకున్నాడు.

"మరే అన్నాయ్యా! నేనుగూడా శతపోరతన్నా పొగాకొద్దని. ఈయనేడ? పెళ్లాం మాటింటేగా?" అందుకుంది కమలమ్మ.

"ఒట్టి మొండి ఘటం గదమ్మా" అన్నాడు సీతా రామయ్య నవ్వుతా.

భార్య మాటలు పట్టించుకోలేదు వరదయ్య. "ఇయ్యేడు రేటు కాత్త అందుకుంటే చాలు, బాకీలన్నీ చుప్తాగా తీరిపోతాయ్" అన్నాడు. పొగాకు కాడతీసి మధ్యలో ఈనె తీశాడు.

ఇంతలోకి పక్క వీధి సూరయ్య పెద్ద కొడుకు రామారావు వచ్చాడు. చేతుల్లో ఏదో కాగితాలుండయ్. రామారావు బియ్యే చదివాడు. ఉద్యోగం లేదు. ఇంటి పట్టునే తండ్రికి సాయంగా నాలుగెకరాల పొలం చూసుకుంటున్నాడు.

"ఏందిరోయ్ పెద్ద పనిమీదే వచ్చి నట్టుండావ్?" అడిగాడు వరదయ్య. చుట్టకొన కొరికి నోట్లోపెట్టు కున్నాడు.

"ఏమంది మావా? సాగర్ నీళ్లు మన పొలాలకి మళ్లించాలని గవర్నమెంటుకికాగితం. అందరి చేతా సంతకాలు చేయించి ఇద్దామని

వ్యవసాయమంత్రి పాటూరు వచ్చేదుందంట. అప్పుడు కలుసుకోని ఇవ్వాల" చెప్పాడు రామారావు. వరదయ్య కూర్చున్న మంచం మీదే కాళ్లకట్టన కూకున్నాడు. "మొత్తం మీద ఏదో ఒకటి తల పెడతానే వుంటావు. నీ అసుమంటోళ్లు ఊరి కిద్దరుంటేసాలు, దేశం బాగుపడుద్ది" అన్నాడు సీతారామయ్య.

"ఈ కాగితాల వల్ల ఏమవుద్ది? ఇంతకు ముందు ఎన్నిసార్లు ఊళ్లోవాళ్లం కిందామీదా పడలేదు?" అన్నాడు వరదయ్య తేలిగ్గా.

"మరే. ఏడేళ్ల నుంచీ ఈతంతు జరుగుతానే వుందాయె. ఒకడేమో ఇయ్యన్నీ మెరకచేలు, నీళ్లె క్కవంటాడు. వుంకోడేమో పంపింగ్ స్కీమ్ పెట్టిద్దా మంటాడు. అంతా అరిసేతులో వేకుంటమే. నాలుగుమైళ్లదూరం లో కిష్టకాలవ పారతన్నా చుక్క నీళ్లు అంద వాయె."అన్నాడు సీతారామయ్య.

ఈ మాటలన్నీ కృష్ణమూర్తి శ్రద్ధగా వింటున్నాడు గానీ సంగతి వాడికి సరిగ్గా అర్థమైనట్టు లేదు.

"ఆ పొగాకు కంపెనీలోళ్లే కాలవ రాకుండా జేశారంటగా?"అందు కుంది కమలమ్మ.

"ఈసారి గట్టి ప్రయత్నం చేద్దాం, ఎలక్షన్లు దగ్గర బడతన్నయ్ గదా? అంతా ఒకకట్టు మీదుంటే గవర్నమెంటుని ఒక పట్టు పట్టొచ్చు. కానీ మావా! సంతకం పొడుప్. ఇంకా పైవీధికెల్లాల." తొందర పెట్టాడు రామారావు.

"సంతకమా? మీ మావది ఏలిముద్ర గదబ్బాయ్!" అంది కమలమ్మ నవ్వుతూ.

"ఓసోస్! అక్కడికి నీకేందో సంతకం సేతయినట్టు" అన్నాడు వరదయ్య రవ్వంత సరసంగా.

"నాకు సంతకం వచ్చునానా! నేను రాసేదా?" అడిగాడు కృష్ణమూర్తి ఉషారుగా. వరదయ్య నవ్వాడు.

"రేపు పెద్దయినాక అట్టనే రాద్దువు లేవాయ్" అన్నాడు రామారావు.


కమలమ్మ లోపలికెల్లి కాటిక్కాయ తెచ్చింది. వర దయ్య చుట్ట అవతల పారేసి ఎడమ చేతి వేలికి కాటిక రాసుకోని రామారావు పేరు రాసిన చోట వేలి ముద్ర వేశాడు.

"ఈ పిల్లాడెట్టా సదువుతున్నాడో, కాత్త పట్టిరేచుకోయ్యా! నీకు పుణ్ణెముంటది" చెప్పింది కమలమ్మ రామారావుతో.

"స్కూలు ఫస్టు వీడేనంటన్నారు పంతులుగారు అయినా శనాదివారాలు నాదగ్గిరికి రారా కిష్టమూర్తీ లెక్కలు చెపుతా."

కృష్ణమూర్తి బుద్ధిగా తలూపాడు. రామారావు బాబాయ్ (అట్లానే పిలుస్తాడు కృష్ణమూర్తి) తనకి లెక్కలు చెపితే ఇంకేం? బాగా చదువుకోని కలక్టరైపోవచ్చు.

రామారావు లేచాడు. సీతా రామయ్య కూడా బయల్దేరాడు.




తండ్రీ కొడుకుల్ని అన్నాలకి లెమ్మంది కమలమ్మ, బయట గాలి బిగదీసింది.

***

ఇంటికి పొగనారు మూటలు దెచ్చాడు వరదయ్య. బుల్లిబుల్లి మొక్కల్ని చూస్తుంటే కృష్ణమూర్తికి కుశాలగా ఉంది. రెండెకరాలకి సరిపొయ్యే నారుదెచ్చాడు వరదయ్య. కమలమ్మకి ఇష్టం లేకపొయ్యినా ఇయ్యేడు పొగాకే వేసి ఐసాపైసా తేల్చుకోవాలనుకున్నాడు. ఊళ్లో ఐదారుగురు రైతులు కొత్తగా పత్తి వేశారు.

పొగనాట్లకి తనుగూడా వెళ్ళాడు కృష్ణమూర్తి. ఇంటి దగ్గిరుండి చెల్లెల్ని ఆడిచ్చరా అని అమ్మ చెప్పినా విన్లేదు. వాళ్లనాన్న పలుగుతో తవ్విన పాదుల్లో నీ ళ్లుపొయ్యటం, నీళ్లు అయిపోగానే చేనికి దక్షిణం దరినున్నకుంటలో మట్టి కడవతో నీళ్లు దేటం కృష్ణ మూర్తి పని. నలుగురు కూలీలున్నారు పొద్దుగూకే వేళకి నాట్లు అయిపోయినియ్.

నాటిన మొక్కల్లో కొన్ని బతకలేదు. వరదయ్య మళ్లీ కొంత నారు దెప్పించి పదిపాదులేశాడు. అప్పుడు మళ్లీ చేనికెళ్లాడు కృష్ణమూర్తి. మొక్కలు కలకలలాడతన్నయ్. పట్టుకుంటే చేతికి జిడ్డుజిడ్డు గా అవుతుంది. "ఇయ్యేం కాయలు గాత్తయ్ నానా?" అడిగాడు కృష్ణమూర్తి వరదయ్యని, పెసర, మినుముకు మల్లే ఇయ్యిగూడా కాయలు గాయాలిగా?

'ఇయి కాయల కోసం గాదురా? బాగా పెరిగింతర్వాత ఆకు నరికి బేరన్‌లో కాలుత్తాం. ఆమైన చెక్కులు గట్టి అమ్మేత్తాం'

"అమ్మితే?"

"అయి కొనుక్కున్నోళ్లు వాటిని చూరచూర జేసి సిగిరెట్లు తయారుజేసి అమ్ముకుంటారు."

కృష్ణమూర్తికి ఇదేం నచ్చలా, ఆకుల్తో సిగిరెట్లు తయారుజేత్తారా? యాక్కిరాయ్‌లే! ఇయ్యేం మొక్కలు! తింటానికి పనికిరాకపోతే ఇంకెందుకు?

***

దీపాలమాసవొస్తందంటే కృష్ణమూర్తి కిబొవ్‌కుశాలగా వుంది. మందులుగా ల్చొచ్చు. దీటీలు తిప్పొచ్చు. ఆదివారం నరసయ్యతో గలిసి గొడ్లను గాసే సుబ్బాయ్ వెంట దీటీల కోసం పడమట పొలాన బీళ్లకెల్లాడు కృష్ణమూర్తి. గడ్డి మోకాటెత్తు పెరిగుంది. ఎడ్ల తోకల్తో ఈగల్ని విసురుకుంటా అదేపనిగా గడ్డిమేస్తన్నయ్.

"ఛె! ఛె! దీటీలు ఊరికినే కట్టి పెడతానేందీ? మీసేలో నాలుగైదు ఏరుసెనగ మండలైనా పీక్కు రాండి,"అనిచెప్పాడు సుబ్బాయ్ కళ్లు గిరగిరా తిప్పు తా.

"మాసేలో ఏరుసెనగ లేదు. పొగాకేశారు" అని చెప్పాడు కృష్ణమూర్తి.

"మాసేలో ఏశారుగా? పొయ్యి తెద్దాంపా"అని నరసయ్య కృష్ణమూర్తి చెయ్యి

బట్టుకొని లేచాడు.

ఇద్దరూ చేలకడ్డం బడి వాగుదాటి శేషయ్యగారి చేనికెళ్ళి వాటెడు వేరుసెనగ మండలు పీకారు. దార్లో వాగు నీళ్లలో జాడిచ్చారు. కాయ ఇంకా ఊరలా. తప్పకాయలే ఎక్కువ. అవే తీసుకొచ్చి సుబ్బాయ్ ముందు బెట్టారు. ముగ్గురూ మండల్నుం చి కాయలు పీకి ఒలుచుకోని తిన్నారు. తర్వాత సుబ్బాయ్ మంచి నల్లతుమ్మచెట్టు చూసి జవరంగా ఉన్న కొమ్మలు నాలుగు కొట్టాడు. బారబార ముక్కలుగా నరికాడు. తోలు దీసి మొదుట్లో చీల్చి ఒక్కొక్కటే బొంగు ముక్కలు దాంట్లో గుచ్చి బిగ్గొట్టి చుట్టూతా రెండు మూడు కడాలు వేసి పొద్దు మళ్లేయేళకి మూడు దివిటీలు తయారుజేశాడు. అప్పుడు దాకా నరసయ్య, కృష్ణమూర్తి ముల్లుగర్రదీసుకోని ఎడ్లని మళ్లేస్తా ఉండి పొయ్యారు. తర్వాత ఇద్దరూ దీటీలు తీసుకోని బయల్దేరారు.

దూరంగా కృష్ణమూర్తి వాళ్ల పొగతోట కనబడతంది. చేలో కలుపు దీస్తన్నారు గావాల.

"అరేయ్! నేను మా చేనుమీదగా ఎల్తానుగానీ దీటీలు దీసుకెల్తావా ఊళ్లోకి?" అనడిగాడు కృష్ణ మూర్తి నరసయ్యని.

"పొమ్మా! ఇయ్యన్నీ నేనెట్టా మోసుకెల్లేది?" అన్నాడు నరసయ్య

"అంతేలేరా! మా నాన రోలు రోకలి చేయిత్తన్నాడు. ఒకపూట నీకియొద్దూ?" ఆశ చూపించాడు కృష్ణమూర్తి.

నరసయ్య సంతోషంగా "అట్టయితే తీసుకెల్తా" అని ఒప్పుకోని దీటీలు భుజం మీదపెట్టుకోని కదిలాడు.


చేలో మల్లెబాగా పెరిగింది. వరదయ్య, కమలమ్మ వెంకట సుబ్బమ్మ, ఇంకో కూలమ్మాయి కలుపు దీస్తన్నారు.

కమలమ్మ కొడుకును జూసి "అబ్బాయ్! ఆదివారం గందా? ఇంటో పిల్లని పట్టుకుంటావనుకుంటే యాడ పెత్తనాల కెల్లావురా?" అనడిగింది.

దివిటీల కోసం వెళ్లినట్టు చెప్పాడు కృష్ణమూర్తి.

"ఏందోనమ్మా మాయదారి పిల్లాడు. పొద్దస్తమానం ఆటలు దప్ప మాటినకుండా తయారవుతున్నాడు" అంది కమలమ్మ మురిపెంగా.

వెంకట సుబ్బమ్మ నవ్వుతూ అందుకుంది. "మాయదారి పిల్లాడా, పిల్లాడా? తద్దెరోజు చింతల తోపులో సిన్నమ్మాయిని ఎంత గోల జేశాడనీ? నీ కొడుకు తక్కువోడు గాదక్కాయో?"



'అన్నీ చాడీలు చెపుతుంది' అనుకుంటా కొరకొరా చూశాడు కృష్ణమూర్తి. అదేం పట్టించ్చుకోలేదు. 'అటు మొన్న మాయెటీల నువ్వు దొడ్లో ఎంకటపతితో గుసగుస మాట్టాట్టం నేం జూశాలే అందామనుకున్నాడు. మళ్లీ నానేమన్నా అంటాడేమోనని ఆగిపొయ్యాడు.

"మాటలాపి కానియ్యండి, ఇంక రెండుసాళ్లే దిగ బడ్డయ్. పొద్దుగూకుతుంది." అంటా తొందరజేశాడు వరదయ్య.

ఇంకో సాలు మిగిలుండగానే కమలమ్మ ఇంటికి బయల్దేరింది. పిల్లని పక్కింటి వాళ్లకిచ్చి పొలాని కొచ్చింది. వెళ్లి దానికి పాలు పట్టాల. వంట జెయ్యాల, ఒకేపు మబ్బు మూసుకొస్తంది. కుంటలో నీళ్లుదాగి కృష్ణమూర్తి వాళ్లమ్మతో బయల్దేరాడు.

పొలం గట్ల మీదగా నడుస్తుంటే అటూ ఇటూ వేరు సెనగ, జొన్న, అక్కడక్కడ పత్తి చేలు కనబడతిన్నయ్. పత్తి చేలు ఇప్పటికి బాగుండట్టే. ఇంకో వాన బడితే బెట్ట దియ్యకుండా ఎక్కొస్తయ్. దారి పక్క గడ్డి మొక్కల మీద బుల్లిబుల్లి నీలం రంగు తూనీగలు వాలతన్నయ్. కృష్ణమూర్తి మెల్లి మెల్లిగా పిల్లిలాగా వెళ్లి ఒక తూనీగని బట్టుకున్నాడు. కమలమ్మ చూసి "ఆటలు మాని తొందరగా కదులబ్బాయ్! అవకడ వానొచ్చేటట్టుంది." అని హెచ్చరించింది. సన్నగా చినుకులు మొదులయినయ్.

ఊరెలపల తోపు దగ్గిరకొచ్చేపాటికి వాన పెద్దదైంది. కమ్మలమ్మ, కృష్ణమూర్తి గబక్కన ఒక చింతచెట్టు కిందకి జేరారు.

"దీని మొదులార! కూసేపుంటే ఇంటక ల్లిపొయ్యే వాళ్లం" అని కమలమ్మ వానని తిట్టింది.

చెట్టు సందుల్లోంచి చినుకులు మీద పడతంటే అమ్మ దగ్గిరికి జరిగాడు. చేతుల్లో తూనీగని వదిలే శాడు. వాడి తలమీద కొంగు గప్పింది కమలమ్మ. మసక చీకట్లో తోపును చూస్తంటే వాడికెందుకో తెలవని దిగులు, భయం కలిగినయ్!

"అమ్మా! రాత్రిపూట తోపులో దెయ్యాలుంటయ్యే?" అడిగాడు అమ్మని. "నీమొకం, పిచ్చిపిల్లాడా!" అని కమలమ్మ వాణ్ణి దగ్గరికి తీసుకుంది.

"మరి నరసయ్యేంది అట్ల జెప్పాడు? వాడొకమావి కొరివిదెయ్యాన్ని జూశాడంట

"అయ్యన్నీ పిచ్చి మాటల్లే" చెప్పింది కమలమ్మ తేలిగ్గా.

'మన సింతలతోపు ఎప్పుడు మొలిసిందే?'

"ఏ మూడు తరాలైందో?" చెప్పింది కమలమ్మ. పెద్దవాన తగ్గింది. ఇద్దరూ ఊళ్లోకి కదిలారు.

* * *

దీపాల పండుగ రానేవొచ్చింది. వరదయ్య కొడుకు కోసం కంపాలితోటి రోలు, రోకలి చేయించాడు. కృష్ణమూర్తి గంధకం, పొటాష్ కొనుక్కొని కర్ర చివర రోట్లో వేసి, తాడుతో రోకలి బిగించి, వినేవాళ్ల చెవులు దిబ్బిళ్లు బడేటట్టు 'ధనాధన్'మని మోగిచ్చటమే మోగిచ్చటం. సీతారామయ్య కొట్టో కొసిని మతాబులు, కారప్పువ్వొత్తులు, టపా కాయలు కొనిపిచ్చుకున్నాడు. అమాసరాత్రి కృష్ణమూర్తి, నరసయ్య ఇంకా వాళ్ల ఈడువాళ్లు కొంతమంది దీటిలు వెలిగిచ్చుకొని వీధులమ్మట 'దివ్వీదివ్వీ దీపావళీ, మళ్లీ వొచ్చే నాగుల చవితీ' అని అరుచుకుంటా బోటిరాళ్ల మీదకి బొయ్యి రాత్రి పొద్దుపొయ్యిందాకా చేతులు నెప్పి పుట్టేటట్టు తిప్పారు. ఊళ్లో పండుగ సందడి, పెద్దగా లేదు. తొలకరి పంటలు బాగుంటే పండగ వెలిగిపొయ్యేది.

కృష్ణమూర్తి ఇంటికొచ్చి అన్నందిని నిద్రబొయ్యేపాటికి రాత్రి పొద్దుబొయ్యింది. తెల్లారి ఎండెక్కిన తర్వాత నిద్దర లేచాడు. కళ్లు నులుముకొని బయటికొచ్చేపాటికి వేపచెట్టు కింద నాన, రామారావు ఏందో మాట్లాడతన్నారు.

"నే ముందే చెప్పలా? ఈ కాగితాల వల్ల పనే మవుద్దని" అంటన్నాడు వరదయ్య. నోట్లో వేపపుల్ల నమిలి తుప్పుక్కున ఊశాడు.

"అయితే అవనీ, కాకపోతే కాకపోనీ, మన పని మనం జెయ్యాలగదా? పని గాకపోవటం కంటే మంత్రిగారివైనమే ఘోరంగా ఉంది. ఇంతమందిం పాటూరు బొయ్యి కాగితం ఇస్తే సరిగ్గా చూణ్ణయినా చూశాడా? అటుఇటూ దిప్పి తర్వాత చూద్దామని, పర్యటనకి ఆలిసెమవుతుందని కారెక్కి పొయ్యాడు. ఏడికి బోతార్లే.

ఓట్ల కోసం మళ్లొస్తారుగా? ఊరంతా ఒకకట్టు మీదుంటే ఏమైనా జరగొచ్చు." అన్నాడు రామారావు.

కృష్ణమూర్తికి వాళ్ల మాటలు బాగా అర్థంగాలా. 'ఓటు' అనే మాట వాణ్ణి పట్టుకుంది.

"ఓటంటే ఏంది బాబాయ్?"అనడిగాడు రామారావుని, రామారావు నవ్వి ప్రభుత్వం, ఎన్నికలు, ఓట్ల సంగతి రెండు మూడు ముక్కల్లో తేలిగ్గా చెప్పాడు. సాయంత్రం లెక్కలు చెప్పించుకోటానికి రమ్మన్నాడు.

"ఇయ్యాల బడికెళ్లేదుందా?" అడిగాడు వరదయ్య కొడుకుని. కృష్ణమూర్తి బుద్ధిగా తలూపి మొకం పుల్లకోసం గబగబా చెట్టెక్కాడు.

* * *

చలికాలం. పొగతోటలు ఎక్కొచ్చినయ్. 'ఇయ్యేడు బాకీలు చుస్తాగా తీరిపోతయ్లే. పిల్లాణ్ణి కూడా సదివిద్దాం' అని చెప్పాడు వరదయ్య కమలమ్మతో.

మార్గశిరంలో గాలివాన రాటంతో రైతుల గుండెలు దడదడలాడినయ్. పెద్ద వానగాక పోయినా భుజాలెత్తు పెరిగిన పొగతోటలు దెబ్బతిన్నయ్. ఎక్కువమంది హెచ్.ఆర్. రకమే వేశారు. తెగుళ్లకి తట్టుకుంటదని, అయినా వానలకి మచ్చతెగులు తప్పలేదు. రంగూ, నాణ్యం తగ్గిపోతయ్. కొత్తగా వేసిన పత్తి చేలు మాత్రం వానలకి తిప్పుకోని బాగుండయ్. ఎకరానికి దిగుబడి పన్నెండు క్వింటాళ్లకి తగ్గదంటన్నారు. పొగాకేసి తప్పు జేశానా అని దిగులుపడ్డాడు వరదయ్య. పొగతోటలు సరిగ్గా కాకపోతే అప్పులు దీరటం కష్టమే. పొగాకు ఎగుమతులు బాగుంటయ్యనే అందరూ అనుకోటం, రేటు అందుకుంటే తిరుగులేదు.

సీజన్ మొదలైంది. వరదయ్య ఇంటి పక్క సాంబయ్యతో గలిసి పొగాకు బేరన్ చెరిసగం లెక్కన అద్దెకు తీసుకున్నాడు. బొగ్గు తోలించాడు. డబ్బు పెగలకపోతే బొగ్గుకి సాంబయ్యే సర్దాడు. ఆకు విరవటానికి ముఠాని మాట్టాడుకున్నాడు. వేకువ జామునే ముఠా బళ్లమీద బయల్దేరటం, తెల్లగా తెల్లరేపాటికి పొగాకుతో బళ్లురాటం, ఆడకూలీలు రొండురొండు ఆకులు అందిస్తంటే మగాళ్లు వాటిని పురికొసకి మెలేసి చకచకా గుర్రాలకి కట్టటం, ఆకు కర్రల్ని బేరన్లో సర్దటం, పొయ్యిలో బొగ్గేసి మండించటం - ఇదంతా కృష్ణమూర్తికి చిత్రంగా ఉంది. అన్నిట్లోకి వాడికి ఆకులు పురికొసకి తొందర తొందరగా మెలేసి గుర్రాలకి కట్టటం చానా అబ్బరంగా ఉంది. పొద్దున్నే వీధి మలుపులో పొన్నాయి చెట్టు కింద రాలిన పూలు తెంపి బూరచేసి ఊదుకుంటా బేరన్ దగ్గిరికి పోవటం, పొయ్యి ముందు చలిగాచుకోటం వాడికలవాటై పొయ్యింది. వరదయ్యకి పనుల్లో చెయ్యాడక బేరన్లో బొగ్గేసే పనికి సుబ్బాయ్‌ని పెట్టుకున్నాడు. సుబ్బాయ్ చావల్తో పొయ్యి తలుపుదీసి బొగ్గేస్తంటే తనూ వేస్తానని పట్టుబట్టాడు కృష్ణమూర్తి. 'ముందు చావల్ని మొయ్యి, సూద్దాం' అన్నాడు సుబ్బాయ్. కృష్ణమూర్తి వల్ల కాలేదు. కాకపోతే అప్పుడప్పుడు బేరన్లో తగిలించిన టెంపరేచర్ గొట్టం తాడుతో లాగి అద్దంలో నుంచి చూసి చెప్పేవాడు. ఒక్కోరోజు సుబ్బాయ్ ఎక్కడియ్యో జొన్న


రచయితలు, కవులు
తమ రచనలు పంపేటప్పుడు
**పాస్‌పోర్టు సైజ్ ఫోటో**
జతచేయవలసిందిగా మనవి
**- ఎడిటర్**

కంకులు దెచ్చి ఊచ బియ్యం గొట్టి చావల్లో పోసి బేరన్‌పొయ్యి బొగ్గులమీద వేయించేవాడు. అవి కృష్ణమూర్తికి బావ్ రుచిగా ఉండేయి.

పొగాకు బేరన్ దిగింది. కొట్టం దగ్గరే పందిరేసి గ్రేడింగ్ మొదులు బెట్టారు. మజ్జాన్నం స్కూల్లో ఇంటిబెల్లు కొట్టంగానే కృష్ణమూర్తి కొట్టం దగ్గిరికి పరిగెత్తేవాడు. చెల్లెలు నిద్ర పోతంటే కమలమ్మ గూడా గ్రేడింగ్ చేస్తంది. వరదయ్య చెక్కులు గడతన్నాడు. వెంకట సుబ్బమ్మ, ఇంకా ముగ్గురు ఆడ కూలీలు వుండారు. వెంకటసుబ్బమ్మ కెందుకో కృష్ణ మూర్తంటే ఉచ్చిలి.




పిల్లాడెందమ్మా అట్ట సిక్కిపోతన్నాడు రోజురోజుకీ" అంది కమలమ్మతో.

"పెట్టింది సరిగ్గా తింటేగా? వాడి ఆటలేందో, వాడేందో" చెప్పింది కమలమ్మ.

"బళ్లో అందరికన్న ఈయనే మిగులంటగా? పిలగాడా! నువ్వు కలట్టరైంతర్వాత నన్ను పెల్లిజేసు కుంటావా?" అనడిగింది వెంకట సుబ్బమ్మ నవ్వుతా.

"నిన్నెంజేసుకోను" తెగేసి చెప్పాడు కృష్ణమూర్తి. వాడి మొకం కందగడ్డకి మల్లే అయ్యింది. కూలీలు నవ్వారు.

పదకొండు చెక్కలకన్న కాలా పొగాకు ఒకటో నంబరు తక్కువే. రేట్లు ఎట్ల వడతయ్యోనని వరదయ్యకి దిగులు బట్టుకుంది.

* * *

ఎండలు ముదురు తున్నయ్. కృష్ణ మూర్తికి పరీక్షలు దగ్గర బడ్డయ్. పిల్లాడి పై సదువు సంగతి ఆలోచించమంది కమలమ్మ. ఊళ్లో హైస్కూలు లేదు. టౌన్లో చదివించట మంటే మాటలా? ఇంటి పరిస్థితి బాగా లేదు. పొగాకు అమ్మలేదు. వడ్డీలు పెరిగి పోతున్నయ్. పెళ్లాం మాటలకి ఊ కొట్టి ఊరుకున్నాడు వరదయ్య.

ఉలవపాడు నుంచి వరదయ్య తోడల్లుడు తిరపతిరావు వొచ్చాడు చుట్టం చూపుగా. ఆ మాటా ఈ మాటా అయ్యిం తర్వాత కృష్ణమూర్తి చదువు సంగతి అడిగాడు. సంగతి తెలుసుకొని "మా వూళ్లో ఐస్కూలుం దిగా? ఆడ పడెయ్యరాదా? ఈడూ మా వోడూ తోడు తోడుగా సదువు కుంటారు" అన్నాడు కమలమ్మకీ మాట బాగానే వుంది. 'సొంత చెల్లెలేగదా ఆడుంది? తనంటే ఆపేక్ష. బాగానే జూసుకుంటది పిల్లాణ్ణి. సక్కంగా సదువు కుంటున్న పిల్లాణ్ణి ఎయ్యో యిబ్బంది లన్జెప్పి మానిపిత్తే అయ్య మాదిరి ఎద్దు ముడ్డి బొడుసుకోవాల్సిందేగా?' అనుకుంది

"సరే, సూద్దాంలే" అన్నాడు వరదయ్య.

"ఇంకా సూసేదేందన్నయ్యా? మల్లీ స్కూలు దెరిసేలోపు మీ మరదలొచ్చి పిల్లాణ్ణి తీసికెల్లిద్ది. చాకిరీ చేసి జేసి మనవేం సంపాదిచ్చాం గనక? ఆళ్లైనా సదువుకుంటే ఏదో ఒక దారి జూసుకుంటారు" అన్జెప్పాడు తిరపతిరావు. "మరే" అంది కమలమ్మ.

* * *

ఊళ్ళో పుకారు బుట్టింది. పొగాకు రేటు పడి పొయ్యిందని. ఎగుమతి ఆర్డర్లు నిలిచిపొయ్యి నయ్యంట. ప్రభుత్వం నిర్ణయించిన దాని కన్న రైతులు ఎక్కువ పొగాకే శారనీ, డిమాండ్ లేక కొనుగోళ్ళు తగ్గినయ్యనీ రకరకాల సంగతులు వింటున్నాడు వరదయ్య. ఒకేపు బాంకి వడ్డీ. కొట్లో ఖాతా పెరిగిపోతన్నాయ్. పొగాకు చెక్కులన్నీ పంచల్లో పడున్నయ్.

టౌన్లో పొగాకు రైతుల సమావేశం. రామారావుతో కలిసెల్లాడు వరదయ్య. రైతు నాయకులు, ప్రభుత్వాధికారులు, బోర్డు అధికారులు అంతా జేరారు. రైతులు ఉద్రేకంగా వుండారు. వేరే దేశాల నుంచి ఆర్డర్లు వచ్చేదాకా ఓపిక పట్టాలని అధికారులు జెప్పారు. ఈ లోపు ప్రభుత్వమే ఎస్.టి.సి.ద్వారా పొగాకు కొనుగోలు చెయ్యాలని రైతు నాయకులు పట్టుబట్టారు. పైపై హామీలైతే దక్కినయ్.

"దొంగనాయాళ్లు. పొగాకు బోర్డులో రైతుల పేరుతో యాపారస్తులుంట మేంది?" అన్నాడు వరదయ్య.

"ఇంకా రైతులందర్నీ కూడగట్టి ఉద్యమం జేస్తేగాని పని జరగదు" అన్జెప్పాడు రామారావు. 'రైతుల్లో కట్టుబాటు లేదు గందా' అనుకున్నాడు వరదయ్య.

రామారావు కాలికి బలపం గట్టుకోని చుట్టుపక్కల ఊళ్లన్నీ దిరిగాడు. ఊళ్లో కుర్రకారుని కదలేశాడు. మొత్తంమీద రైతులు కదిలి రాస్తారోకోలు జేశారు. టౌన్లో నిరాహార దీక్షలు జరిగినయ్. చివరాఖరికి పొగాకు కొంటానికి ఎస్.టి.సి. రంగంలో కొచ్చింది. అయితే అప్పటికే భాకీలు తట్టుకోలేని రైతులు ప్రైవేటు వ్యాపారస్థులకి అయినకాడికి పొగాకమ్ముకున్నారు.

వేలం కేంద్రాలు దెరిచిన వుషారు రైతుల్లో నాలుగు రోజులు గూడా నిలవలేదు. బంగారంలాంటి ఒకటోనెంబరు పొగాకు గూడా పన్నెండొందలకి మించి పలకలేదు. వరదయ్యకి పొగాకంతా అమ్ముడు బొయ్యిందిగానీ పట్టుమని ఎనిమిదేలు వచ్చేపాటికి గగనమైంది. ఏ ముక్కులోకి చాలతయ్? కొట్లోబాకీ, బాంకి బాకీ, సీజన్ ఖర్చులకోసం పట్నంలో మందుల కొట్టో దెచ్చిన బాకీ - అన్నీ కళ్లముందు తిరిగినయ్.

"అంతా మోసం. ఆరుగాలం మనం సెమటోడ్చి పండిత్తే ఆడెవుడో వచ్చి కనాకష్టంగా రేటు గట్టటమేంది? రామారావు జెప్పినట్టు ఇదంతా దోపిడీయే." అన్నాడు వరదయ్య కమలమ్మతో. కమలమ్మ మనాదేసుకుంది. రేపుణ్ణుంచి ఇల్లు గడిసే దెట్టా?

* * *

"ఇయ్యాల తోపులో కోతికొమ్మచ్చి ఆడుకుందాం రా. చానామంది వత్తన్నారు."

అని చెప్పాడు నరసయ్య కృష్ణమూర్తితో ఇంటి దగ్గిరకొచ్చి.

మిట్ట మజ్జానం. కమలమ్మ లోపల పనిలో ఉంది. చెల్లెలు నిద్ర పోతంది. పంచలో కోడిపిల్లల అలికిడి తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. వరదయ్య ఇంట్లో లేడు. కృష్ణమూర్తి ఒక్క లగూ దీశాడు.

తోపులో నీడగానే ఉంది. పిల్లలు పదిమందిదాకా తయారయ్యారు. కాసేపు పండిన చింతకాయలు కోసుకుతిన్నారు. తర్వాత చింతచెట్టు మొదలు దగ్గిర నరసయ్య గిరిగీసి కర్రపుల్ల కాలికింద నుంచి దూరంగా విసిరాడు. ఆ పుల్ల తేటానికి రాముడు పరిగెత్తగానే అందరూ గబగబా చెట్లెక్కారు. రాముడి కెవరూ చిక్కటంలేదు. ఒక్కొక్కడు కొమ్మల్లోంచి దూకి వాడికంద కుండా గిరిలోకి పరిగెత్తుతున్నారు. ఇంతలోకి చిటారుకొమ్మమీద నుం.ి నరసయ్య పెద్దగా కేకేశాడు.

"అరే కిట్టమూర్తీ! అక్కడేందో ఏలాడ తంది సూడరా"

కృష్ణమూర్తి పరీక్షగా చూశాడు. ఇద్దరు ముగ్గురు పిల్లలు మళ్లీ చెట్టెక్కారు. దూరంగా ఇంకో చింతచెట్టు కొమ్మకి ఎవురో ఏలాడ బడ్డట్టుంది. అంతా గబగబా అక్కడికి పరిగెత్తారు. చింతచెట్టు కిందకొమ్మకి నేలకి గజమెత్తున నారాయణవాళ్ల నాన పుల్లయ్య శరీరం వేల్లాడ తంది. పైపంచకి ఉరేసు కున్నాడు. ఎప్పుడు ప్రాణం బొయ్యిందో కళ్లు తెరుచుకొని, నాలికి బయటికొచ్చి అంతా భయంకరంగా ఉంది. కృష్ణమూర్తికి చిరు చెమటలు బట్టుకొచ్చినయ్. పిల్లలంతా భయంతో గుండెలు దడ దడలాడతా ఊళ్లోకి పరిగెత్తారు.

ఊరంతా గుప్పుమంది. జనమంతా పోయ్ చూశారు. అప్పులెక్కువై ఉరేసు కున్నాడు పుల్లయ్య. పొగాకేసి ఆరిపొయ్యాడు. ముగ్గురాడ పిల్లలు, నారాయణగాక. ఎవరికీ చెప్పకుండా రాత్రికి రాత్రే ఈ ఘోరం జేశాడు. నారాయణ గోల గోలగా ఏడుస్తుంటే కృష్ణమూరికీ ఏడుపొచ్చింది. పుల్లయ్యతాత తనంటే ఎంతో ఆపేక్షగా వుండేవాడు. బాగా చదువుకోమని చెప్పేవాడు.

"పుల్లయ్యతాత ఎందుకు చచ్చి పొయ్యాడు నాన్నా?" అని ఆ రాత్రి అడిగాడు తండ్రిని. పక్కనే రామారావు గూడా ఉండాడు.

"గవర్నమెంట్ చంపేసిందిరా" చెప్పాడు రామారావు గంభీరంగా.

కృష్ణమూర్తి కళ్లముందు పుల్లయ్య తాత శరీరమే కనబడుతంది. రాత్రి నిద్రలో జరం వచ్చింది. కలవరింతలు మొదలు పెట్టాడు. కమలమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంది. దిష్టితీసింది. వరదయ్య డాక్టర్ని లేపి తీసు కొచ్చాడు. ఇంజక్షన్ చేశాడు డాక్టరు. రెండో రోజు మాయిటేళకి గాని జరం తగ్గలేదు.

***

ఎన్నికల సందడి మొదలైంది. గోడల మీద కాగితాలంటిచ్చారు. మైకులు, జీపులు వచ్చిపోతన్నాయ్ ఊళ్లోకి. జీపులు రాంగనే పిల్లకాయలు వెంటబడి కాగితాలందు కొంటన్నారు. బైటి హడావుడి దప్ప ఊళ్లో వుషారులేదు. వరసగా నాలుగేళ్ల నుంచీ పంటలు దెబ్బతింటంతో రైతులంతా దిగాలుగా ఉండారు. పుల్లయ్యతాత చావు చానమంది రైతుల గుండెలమీద దెబ్బ దీసింది.

అప్పులమధ్య వరదయ్య కేం జెయ్యాలో పాలుబోవటంలా. కుంటచేను అరెకరం బేరం బెట్టాడు. ఎంతకాలం ఈ రొండు మూడెకరాల్తో పండీ పండక యీడగిల బడతం? ఉన్నట్టుండి వరదయ్యకి చింతలతోపు కొట్టేద్దామనే ఆలోచన వచ్చింది. పుల్లయ్య అందులో ఉరేసుకున్నప్పటి నుంచి తోపుమీద బ్రమ పోయింది. దానిమీద రాబడీ లేదు. సుబ్బరంగా రొండెకరాల వత్తిచేనవుద్ది. అంతా కలుసుబాటుగా వుంటే వచ్చే యేటికి బాకీలు తీరిపోతాయ్. పెళ్లానికీ ఆలోచన జెప్పాడు.

"పిచ్చా, చాదస్తమా? తాతలనాటి తోపు కొట్టేద్దామంటే వేంది? కలిసొత్తే యీ పొలం జాలదా?" అంది కమలమ్మ. అయినా వరదయ్యకి ఆ ఆలోచన పోలా.

కృష్ణమూర్తికి ఐదోతరగతి పరీక్షలై పోయినియ్. ఉండ పదిమంది పిల్లల్లో వాడే ఫస్టు. కోదండం పంతులు గారు పనిమాలా ఇంటికొచ్చి వాణ్ణి హైస్కూల్లో జేర్పిచ్చాల్సిందే నన్నారు. 'ఏరా, సదువుతావా?' అని వరదయ్య అడిగితే కృష్ణమూర్తి 'ఓ' అన్నాడు. తొందరగా చదువు కొని డాక్టరు గావాలని వాడి వుబలాటం. కమలమ్మ గూడా పట్టుబట్టింది.

ఆ రోజు మాయిటేల రాములవారి గుడి దగ్గిర కృష్ణమూర్తి, ఇంకా సావాసగాళ్లు గోలీలాడతన్నారు. మండపంలో పదిమంది దాకా పెద్దాళ్లుండారు.

ఒక్కొక్కళ్లే జనం పోగవుతున్నారు. గోలీలాటలో కృష్ణమూర్తికి మంచి గురి ఉంది. పొద్దుగూకేపాటికి ఆటలో జేబు నిండా గోలీలు వచ్చినయ్. తర్వాత పిల్లలంతా గోలీలాట ఆపేసి 'వాలింకి' ఆట మొదలు బెట్టారు. నరసయ్య కాలితో గుండ్రంగా పెద్ద గిరి గీస్తా, తిరుగుతా పాడతంటే తక్కిన పిల్లలు అందుకొన్నారు.

"వాలిం కోలింకే!"

"చంద్రా వాలింకే"

"చెట్టును గొట్టే దెవురు?"

"చేమల పుల్లాయ్"

"వాణ్ణి గొట్టీ....."

"వీణ్ణి గొట్టీ....."

"వీణ్ణి గొట్టీ....."

"కట్టకింద చిన్నెంకణ్ణి గొట్టండీ"

అందరూ చిన్నెంకడిమీద బడంగానే వాడు గిరి బయటికి పారిపొయ్యాడు. గిరి చుట్టుతా అటుదిరిగి ఇటు దిరిగి లోపలున్న

## దూరదర్శన్‌లో 'క్రికెట్ కౌంట్‌డౌన్'

క్రికెట్ వరల్డ్ కప్ 1996- ది కౌంట్‌డౌన్ ధారావాహిక దూరదర్శన్‌లో త్వరలో ప్రసారం కాబోతోంది. క్రికెట్ క్రీడాభిమానులకు ఈ సీరియల్ కనువిందు. ప్రపంచ ప్రఖ్యాతి గావించిన క్రికెటర్లను, క్రికెట్‌క్రీడా మైదానాలను ఈ సీరియల్‌లో చూపిస్తారు. నింబస్ సంస్థ ఈ సీరియల్‌ను 16 భాగాలుగా రూపొందిస్తోంది. అలెన్ బోర్డర్, ఇయాన్ చాపెల్, కృష్ణమాచారి శ్రీకాంత్, మొహిందర్ అమర్‌నాథ్, క్లైవ్‌లాయిడ్ లాంటి విశ్వవిఖ్యాత క్రికెటర్లు, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన క్రికెట్‌క్రీడా మైదానాల విశేషాలను ఈ సీరియల్‌లో వివరిస్తారు. ఈ 'కౌంట్ డౌన్' కోసం క్రికెట్ లవర్స్ ఎదురుచూస్తున్నారు.

-- సాయి సందీప్

వాళ్లని బయటికి లాక్కెళతన్నాడు. లాక్కెళ్లే టప్పుడు 'దబిడీదిబిడీ' దెబ్బలు బాగనే పడతన్నయ్. అంతా గోలగోలగా ఉంది.

"అరే మీ ఆటలాపండ్రా" ఎవురో పెద్దాయన అరిచాడు మండపంలోంచి. పిల్లలు ఆటలు కట్టిపెట్టారు.

ప్రెసిడెంటు వెంకటేశ్వరరావు గుడి మండపం లోకి రాంగనే రైతుల మల్లగుల్లాలు మొదలయినయ్. ఎవురోవచ్చి మండపంలో మైకు బెట్టారు. దాదాపు ఊళ్లో రైతులంతా మండపం దగ్గిరికి జేరారు. వరదయ్య ఒక పక్కన నిలబడ్డాడు. కృష్ణమూర్తికీ, నరసయ్య కీ సంగతేందో తెలవలా. ఇంతలో 'బయ్'న నాలుగు కార్లొచ్చి మండపం పక్కన ఆగినయ్. నల్లగా నిగనిగలాడతన్న లావాటి మనిషిని జూసి 'అడుగో మంత్రిగారొచ్చారు' అన్నారెవరో. రెండో కార్లోంచి దిగినాయన్ని జూసి 'ఆయనే ఎలక్షన్ కాండిడేటు' అను కున్నారు. అందరికీ దణ్ణంబెట్టి మంత్రి, అభ్యర్థి కుర్చీల్లో కూర్చున్నారు. ముందు ప్రెసిడెంటే మైకు దీసుకోని అందర్నీ 'మన'పార్టీకి ఓటెయ్యమని అడిగాడు. తర్వాత మంత్రిగారు అందుకోని రైతుల సమస్యలు ప్రస్తావించి, తొందర్లో వాటిని దీరుస్తానని వాగ్దానం చేశాడు.

"ఎప్పుడో జేసేది తరవాత సంగతి. ఇప్పటికేం జేశారో చెప్పండి. నాలుగేళ్లనుంచి రైతుల పరిస్థితి గోరంగా ఉంది. ఇయ్యేడైతే గుల్లగుల్లయి పొయ్యారు. పొగాకుకు రేటు లేకుండా జేసి ఈ గవర్నమెంటే మా కొంప ముంచింది" అన్నాడొక రైతు ఉద్రేకంగా.

అభ్యర్థి మొకం నల్లబడింది. మంత్రి నవ్వలేక నవ్వాడు.

"ఇప్పుడెట్లాగూ పొగాకు సీజన్ అయి పొయ్యింది గదా? వచ్చేయేడుముందు నుంచే ఎగుమతి ఆర్డర్లకోసం ప్రయత్నిద్దాం. మీకు గిట్టుబాటు ధర దొరికేట్టు చెయ్యటం నాదీ పూచీ" అని చెప్పాడు నిభాయించు కుంటూ.

"ఇట్టాంటి మాటలు నమ్మే ఈ కాడికొచ్చాం. మీరు ఈ పొగాకు కంపెనీల వాళ్లు కుమ్మక్కై ఇదంతా జేస్తన్నారు. పొగాకు ఎగుమతుల పేరన దేశాల్నే మోసం జేసిన వాళ్లని మీరేం జేశారు? ఈ అభ్యర్థి వాళ్ల తాలూకేగా? కంపెనీలు పెట్టిన పదేళ్లలో వాళ్లు కోటీశ్వరులై పొయ్యారు. ఏళ్ల తరబడి చాకిరీ జేస్తన్న రైతులేమో మట్టి గొట్టుకు పొయ్యారు. నాలుగుమైళ్ల దూరంలో కిష్ట కాలవుంటే అది రాకుండా జేశారు. ఈ నల్లనేలల్లో పొగాకేస్తే బంగారం పండిద్దనీ, ప్రతిరైతూ లక్షాధికారి అవుతాడనీ అరిసేతుల్లో వైకుంఠం చూపించారు. ఇప్పుడీ చుట్టుపక్కల ఊళ్లల్లో జరుగు తున్నయ్యి తాకట్టులూ, జప్తులూ, ఉరేసు కోవటాలూ. ఇంకా ఏం జూసి మీకు ఓటెయ్య మంటా?" అని రామారావు నిలదీశాడు. అభ్యర్థి బిత్తరపోయి చూస్తన్నాడు.

"ఊళ్లంతా దొంగనాయాళ్లు" అన్నాడొక రైతు. ఆ మాట మంత్రి చెవిన పడింది. బి.పి. మూలంగా ఉద్రేకం ఆపుకోలేకపొయ్యాడు.

"చెప్పేది వినకుండా మీరు మరీ మూర్ఖంగా ప్రవర్తిస్తన్నారు". అన్నాడు తీవ్రంగా.

అప్పుడుదాకా మండపం స్తంభాని కానుకోని ఈ మాటలన్నీ వింటన్న వరదయ్యకి కోపం నసాళాని కంటింది.

"ఏంది ఇంకా నువ్వు జెప్పేది నా..." అంటా చేతులో ఉన్న ముల్లుగర్ర పైకెత్తాడు. కళ్లెర్రబడ్డాయ్యి. బుసలు గొట్టాడు. మంత్రికీ అభ్యర్థికీ దడ బుట్టింది. ప్రెసిడెంటుతో ఏందో మాట్టాడి మంత్రి గబగబా కారెక్కాడు. వరదయ్య తుపుక్కున ఉమ్మేశాడు.

పిల్లలంతా 'హే' అని గోలకి లేచారు. కార్లుబోతంటే ఎనకమాలే పరిగెత్తారు. కృష్ణమూర్తికి ఊకదెలిసినప్పట్నుంచి వాళ్ల నానకి అంత కోపం రాటం ఎప్పుడూ చూల్లా. ఎందుకోగానీ వాడికీ ఉక్రోషం వచ్చింది. మాంచిరాయి దీసుకోని వెనక కారు అద్దం పగిలేటట్టు గురిచూసి విసిరాడు.

రైతులు మండపం దగ్గిరే మల్లగుల్లాలు బడ్డారు. ఈ నేలలన్నీ మాగాణి అయితే తప్పితే మన బాధలు తీరవన్నాడు రామారావు. సాగర్ నీళ్లకోసం గవర్నమెంటుని పట్టుబట్టాల్సిందేనని ఇంకోరైతు మాట్టాడాడు. అప్పుడుదాకా ఊళ్లోకి ఏ పార్టీ వాళ్లనీ అడుగుపెట్ట నియ్యొద్దను కున్నారు రైతులు. చుట్టుపక్కల ఊళ్ల రైతుల్నీ



కలుపుకోవాలనే ఆలోచనొచ్చింది. ప్రెసిడెంటు పక్షానున్న నలుగురైదుగురు తప్పిచ్చి తక్కిన రైతులందరిదీ ఒకటే మాట.

* * *

ఒకరోజు నరసయ్య పరిగెత్తు కుంటా వొచ్చి, "అరే, మీ సింతలతోపు కొట్టేత్తన్నార్రా" అని చెప్పాడు.

వాడికేం అర్థంగాలా. తోపు కొట్టెయ్యట మేంది? అది లేకపోతే ఏవుంది? వాడి ఆటలూ, పాటలూ అన్నీ తోపుతో ముడిబడి వుండయ్.

ఇద్దరూ తోపుకేసి పరిగెత్తారు. అప్పటికే కూలీలు సగం చెట్టు పడగొట్టారు. కొమ్మలు రంపాలతో కోస్తన్నారు. వరదయ్య దగ్గిరుండి చూస్తన్నాడు. చెట్లు పడిపోయిన చోటంతా బోసిగా, నీడ లేకుండా వెలితిగా కనబడతంది. కృష్ణమూర్తి కెంతో యిష్టమైన పెద్ద చింతచెట్టు పడిపొయ్యి వాడి వంకే దీనంగా చూస్తన్నట్టుంది. వాడికి కళ్లమ్మట నీళ్లు దిరిగినియ్.

'నానా!" అన్నాడు వరదయ్య దగ్గిరికి బొయ్యి.

"ఏందిరా" అడిగాడు వరదయ్య కూలీలు జేసే పనివంకే జూస్తా.

"చెట్లెందుకు పడేత్తన్నారు?"

"ఇయ్యన్నీ ఉండేం ఉద్ధరిత్తన్నయ్ లే. కొట్టేసి సేను జేద్దామని. వచ్చే యేడు పత్తి ఎయ్యొచ్చు" చెప్పాడు వరదయ్య. కానీ తన మాటల్లోనూ విచారమే.

కృష్ణమూర్తి ఇంకేం మాట్టాళ్లేక పొయ్యాడు. దిగులుగా నరసయ్యతో పాటు ఇంటికొచ్చాడు. కమలమ్మ పంచలో కూచుని చేటలో బియ్యంలో రాళ్లేరతంది. పక్కనే పిల్ల గిలక్కాయలతో ఆడుకుంటంది. కృష్ణమూర్తి తల్లి పక్కన జేరి "అమ్మా! తోపు కొట్టేత్తన్నారే" అన్నాడు.

"ఏందో నాయనా! ఏం జెయ్యటానికీ కాళ్లూ సేతులాట్టం లేదు. పంటలు జూత్తే అట్టుండయ్. బాకీలు దీరలేదు. తోపుకొట్టేసి పొలం జేద్దామని మీ నాన. తరాలనాటి తోపు. మీ ముత్తాత ఎందుకేశాడో ఏశాడు. పచ్చగా వున్న చెట్లని గొట్టి సేను జేసేదేంది? సెపితే యినడు మీ నాన" అంది కమలమ్మ.

చానరోజుల్దాకా కృష్ణమూర్తి ఏందో పోగొట్టుకున్నాడికి మల్లే దిగులుగా ఉండి పొయ్యాడు. ఎగురుతున్న తూనీగ రెక్కలిరగ దీసినట్టయింది.

ఉలవపాడునుంచి కమలమ్మ చెల్లెలు కుమారి వొచ్చింది కొడుకుతోపాటు. వాడి కొత్తబట్టలు, నాజూకు చూసి కృష్ణమూర్తి సిగ్గుపడ్డాడు. తనకి మంచి గుడ్డలేలెవ్వు. ఉన్నయి మాసిపోయినయ్. ఒక్కటే దాపుడు చొక్కా. కుమారి కొడుకు మాత్రం బిడెం లేకుండా కాసేపట్లోనే కృష్ణమూర్తితో కలిసి పొయ్యాడు. ఇద్దరూ నరసయ్యతో కలిసి ఆడుకోటానికి బొయ్యారు.

కుమారి ఆ రోజుండి పొయ్యింది. మరసటి రోజు కృష్ణమూర్తిని దీసుకెళ్తానంది. పిల్లాడు పైకి చదవబోతన్నందుకు కమలమ్మ కి సంతోషంగా ఉన్నా పంపిచ్చటానికి బాధ పడింది. "ఇక నుంచీ అబ్బాయ్ నీ కొడుకేనే" అని కళ్లనీళ్లు పెట్టుకుంటా చెల్లిలికి అప్ప జెప్పింది. కృష్ణమూర్తి బిక్కమొకం వేసుకున్నాడు. వాడి తలనిమిరి దగ్గిరికి తీసుకుంది కుమారి. వరదయ్య చాటుగా కళ్లు తుడుచుకున్నాడు. ఊరికెళ్లి పోతన్నట్టు సావాసగాళ్లకి చెప్పొచ్చాడు కృష్ణమూర్తి. నరసయ్య వాడి వెంటే వుండాడు.

ఊరుదాటి డొంకదారిన మైలు పోయి బస్సెక్కాల. వరదయ్య సవారి బండి గట్టాడు. కృష్ణమూర్తికి లోపలంతా చెప్పలేని దిగులుగా వుంది. వాడి చిన్నతన మంతా ఆ ఊరుతో అల్లుకుపొయ్యింది. ఇపుడెవురో తెంపేస్తన్నారు. మళ్లీ ఎన్నిరోజుల కొస్తాడో? బండి ఊరు చివర చెరువు కట్టమీద కొచ్చినాక వొక్కసారి వెనక్కి దిరిగి చూశాడు కృష్ణమూర్తి. ఊరు ఊరుగానే సడీ సప్పుడు లేకుండా వుంది. ఊరుమీద చింతలతోపు మాత్రం కనబట్టంలా. అంతా వెలితి. 'కిట్టమ్మా! గోపాల కిట్టమ్మా!.....' అంటా ఎవురో పాడతన్నట్టనిపించింది కృష్ణమూర్తికి వెనక్కి మళ్లీ చూశాడు. ఎవురూ లేరు. వాడి కళ్లమ్మట గిరగిరా నీళ్లు దిరిగినియ్.

●

